

## పదేండ్ల కిందటి కట్టం మళ్లచ్చింది

నేను రెండెకరాల వరి వేసిన. వరి పొట్టకొచ్చింది. బాయిలో నీళ్లు అడగుంటినయి. కేసీఆర్ ఉన్నప్పుడు మా ఊరు పక్కన ఉన్న ఇరుకుల్ల–నగునూరు వాగుపారేది. కాళేశ్వరం నీళ్లతో నారాయణపూర్ రిజర్వాయర్ ద్వారా అట్లనే కొత్త పల్లి చెరువు ద్వారా వాగులోకి నీళ్లొచ్చేవి. కనుక మా బాయిలో ఎప్పుడు నీళ్లు దంగక పోయేది. ఆ నమ్మకంతోనే ఇప్పుడు కూడా వరి వేసినం. ఇప్పుడు బావిలో నీళ్లు లేవు. అలాగే మాటిమాటికి కరెంటు పోతంది. పగలు ఆఫ్ కరెంట్ వత్తంది. అందుకే రాత్రి 11 గంటలకు బాయికాడకు పోయి. ఊరిన నీళ్లు ఊరినట్లుగా పొలానికి పెడుతున్నం. ఇటు నీళ్లు లేక, అటు కరెంటు రాక అవస్థలు పడుతున్నం. రాత్రిపూట ఒక్కో మడికి పైపు వేసి పారించుకుంటున్నం. అయినా కష్టమే ఉన్నది. పొట్టకు వచ్చిన వరి ఇంట్లకు వచ్చేదాక నమ్మకం అయితే కనిపిత్తలేదు. వాగుకు నీళ్లు ఇడ్వుమన్నా ఇస్తలేదు. మా ఊరిలోనే వాగుపొన్న యాభైమంది రైతుల బాయిలున్నయి. వారందరికి ఇదే కట్టం.

**-అట్ల ఓదెలు, రైతు (నల్లగుంటపల్లి)**

## కేసీఆర్ పాలనలోనే యాదవులకు మేలు

- **కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్**



గోపాల్‌రావుపల్లిలో వినోద్‌కుమార్‌ను సన్మానిస్తున్న యాదవులు

గంగాధర, మార్చి 20: కేసీఆర్ పాలనలోనే యాదవులకు మేలు జరిగిందని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. వారు ఆత్మగౌరవంతో బతికేందుకు సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకానికి అంకురార్పణ చేశారని పేర్కొన్నారు. బుధవారం ఆయన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, టీడీసీ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌తో కలిసి గోపాల్‌రావుపల్లెలో నిర్వహిస్తున్న బీరప్ప ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాతర నిర్వాహకులు వినోద్‌కుమార్‌ను గొంగడితో సన్మానించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో యాదవులతో మాట్లాడారు. యాదవుల సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు. ఇక్కడ నాయకులు నాగారపు సత్యనారాయణ, నాగిశేఖర్ ఉన్నారు.

### కేసీఆర్ పాలనలో ఉన్నట్టు కరెంటు లేదు

నేను రెండెకరాల్లో వరి, ఇరవై గుంటల్లో కొత్మీరు వేసిన. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు ఉన్నట్టు ఇప్పుడు కరెంటు వస్త లేదు. నీళ్లు కూడా లేవు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలున్న ప్రాంతాలకు కాలువ నీళ్లు ఇస్తన్రు. మా కరీంనగర్ రూరల్ మండలంలోని చేగుర్తి, ఇరుకుల్ల, నల్లగుంటపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలకు చుక్కనీళ్లు ఇస్తలేరు. ఎస్సారెస్పీ కాలువలున్నా ఇప్పటివరకు నీళ్లు రాలేదు. అడిగితే ఎవరూ చెప్పరు. కాలువ నీళ్లు రాక బాయిలు, బోర్లలో నీళ్లు కొద్దిగా వస్తున్నయి. ఊరిన నీళ్లను పెట్టుకుందామంటే.. పగలు సక్కగా కరెంటు వస్త లేదు. రాత్రి 11 గంటల నుంచి తెల్లారి 5 గంటల దాకా త్రీఫేస్ ఇస్తున్రు. అందుకే రాత్రి మోటర్ల కాడే పడుకొని ఊరిన నీళ్లను ఊరినట్లు పొలంకు పెడుతున్నం. పొలాలు పొట్టకు వొచ్చినయి. కాలువలకు నీళ్లు ఇచ్చి మమ్మల్ని ఆదుకోవాలి. పగలు ఫుల్ కరెంటు ఇవ్వాలి.

**- తమ్మనవేని ఓదెలు, నల్లగుంటపల్లె రైతు, బీజేపీ కిసాన్‌మోర్చా కోశాధికారి**



రాత్రిపూట బావి వద్ద నిద్రిస్తున్న తమ్మనవేని ఓదెలు

# కరెంట్ కష్టాలు.. కర్షకుల కన్నీళ్లు

- అన్నదాతకు మళ్లీ పదేళ్ల కిందటి గోస
- యాసంగిలో అడుగంటుతున్న చెరువులు, కుంటలు, బావులు
- సాగునీరు లేక ఎండుతున్న పొలాలు
- ఆపై ఆఫ్ కరెంట్ తిప్పలు
- త్రీఫేస్ కోసం రాత్రిపూట బావుల వద్ద పడుకుంటున్న నల్లగుంటపల్లె రైతులు
- దాదాపు అంతటా ఇవే పరిస్థితులు
- ఆందోళనలో రైతాంగం
- స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- ప్రశ్నార్థకంగా వేలాది ఎకరాలు
- ఇటీవల సిరిసిల్ల జిల్లాలో వరికి నిప్పు

కాంగ్రెస్ మూణ్నెళ్ల పాలనలో అన్నదాతలకు పదేళ్ల కిందటి కష్టాలు ఎదురవుతున్నాయి. కాళేశ్వరం నుంచి నీటిని ఎత్తిపోయక పోవడంతో యాసంగిలో చెరువులు, కుంటలు, బావులు ఎండిపోతున్నాయి. ఇప్పటికే చాలాచోట్ల భూగర్భ జలాలు అడుగంటాయి. మరోవైపు లోవోల్టేజీ తిప్పలు మొదలయ్యాయి. ఈ పరిస్థితుల్లో పొట్టకొచ్చిన వరిని కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోస పడాల్సి వస్తున్నది. త్రీఫేస్ కరెంట్ కోసం రాత్రిపూట మోటర్ల దగ్గర పడుకోవాల్సిన దుస్థితి వచ్చింది. చేతికొచ్చే దారిలేక కొందరు పంటలు వదిలేస్తే.. మరికొందరు కడుపుమండి ఎండిన వరికి నిప్పంటిస్తున్న దయనీయ స్థితి ఉన్నది. ఈ సమయంలో ఆదుకోవాల్సిన రాష్ట్ర సర్కారు, రైతన్నకు ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. 'పైగా కరెంటు ఇస్తున్నాం.. నీళ్లు ఇస్తున్నా'మంటూ బీరాలు పోతున్నది.



రాత్రిపూట మోటర్లు పెట్టి ఇరుకుల్ల వాగులోనే నిద్రిస్తున్న రైతులు అంజయ్య, మల్లేశం



### రాత్రి మూడు గంటల దాకా తెలివితోనే

నేను రెండెకరాల్లో వరి వేసిన. మళ్లీ ఇప్పుడు కట్టాలు కనిపిస్తున్నయి. పదేండ్ల కిందటి ఎవుసం అగుపడుతున్నది. బాయిల్లో కనుచూపు మేర నీళ్లు అగుపిస్తలేవు. ఊరిన నీళ్లను ఎప్పటికప్పుడు పెడుదామంటే.. కరెంటు ఇబ్బంది ఉంది. అందుకే రాత్రి వస్తున్న. రాత్రి పదకొండు నుంచి మూడు గంటల దాకా తెలివితోనే ఉండి ఊరిన నీళ్లను పెడుతున్న. నీళ్లు సక్కగా ఉంటే రాత్రి పూట రావాల్సిన ఖర్మ మాకెందుకు ఉంటది. సర్కారు ఏమి పట్టించుకోవడం లేదు. ముందుగనే చెబితే ఈ పంట వేసుకునే వాళ్లం కాదు. ఇంత తిప్పలు ఉండేవి కావు.

**-తమ్మనవేణి నర్సయ్య, రైతు (నల్లగుంటపల్లె)**

కరీంనగర్, మార్చి 20 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కరీంనగర్ రూరల్: కరీంనగర్ రూరల్ మండలంలోని రైతుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. ప్రధానంగా ఇరుకుల్ల–నాగులమల్యాల వాగు వట్టిపోవడంతో సాగు నీటి కటకట తీవ్రమైంది. గతంలో కాళేశ్వరం జలాలు ఎత్తిపోస్తే నారాయణపూర్ రిజర్వాయర్ ద్వారా, అలాగే ఎస్సారెస్పీ నుంచే వచ్చే నీళ్లు కొత్తపల్లి చెరువు ద్వారా ఈ వాగులోకి వచ్చేవి. ఈ వాగుపై వందలాది వ్యవసాయ బావులున్నాయి. పదేళ్ల కాలంలో ఇవి ఎన్నడూ ఎండిపోయిన దాఖలాలు లేవు. ఈ వాగు పరీవాహక ప్రాంతంలోని ప్రతి రైతూ తనకున్న భూమిలో వరి వేసుకొని దర్జాగా పట్టపగలు మోటర్లు ద్వారా పారించుకునే వారు. కానీ, ప్రస్తుతం పరిస్థితులు తారు మారయ్యాయి. కాంగ్రెస్ వచ్చి మూడు నెలలు కాకముందే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. ఈ వాగు పరీవాహక ప్రాంతంలోని నల్లగుంటపల్లె రైతులు పంటలను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నారు. పదిహేను రోజులుగా రాత్రి పూట మోటర్ల వద్దే పడుకుంటున్నారు. ఎస్సారెస్పీ నుంచి నీళ్లు రావాల్సి ఉన్నా ఈ సీజన్‌లో ఒక్కరోజు కూడా రాక సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. ఇరుకుల్ల–నాగులమల్యాల వాగుకు గతంలో ఇటు నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి అలాగే కొత్తపల్లి చెరువు నుంచే కాకుండా పైన ఉన్న పొలాల నుంచి నీళ్లు వచ్చి కలిసేవి. తద్వారా ఈ పరీవాహక ప్రాంత బావుల్లో నీరు పుష్కలంగా ఉండేది. దీంతో ఈ వాగు ఒడ్డుకు ఆనుకొని నల్లగుంటపల్లెకు చెందిన యాభై మంది రైతులు బావులు తవ్వుకొని మోటర్ల ద్వారా వరి సాగు చేసుకునేవారు. గతంలో మాదిరిగానే ఈ సారి నీళ్లు వస్తాయని ఆశతో వరి పంట వేస్తే నిరాశే ఎదురైంది. కాళేశ్వరం నుంచి నీళ్లు ఎత్తిపోయక పోవడంతో వాగుకు నీళ్లు రావడం లేదు. మరోవైపు భూగర్భజలాలు అడుగంటిపోయాయి. బావులు, బోర్లలో పాతాళానికి చేరాయి. ఫలితంగా రైతులు ఊరిన నీటిని ఊరినట్లుగా పొలాలకు పెడుతూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే పగటి పూట కరెంటు సతాయిస్తున్నది. లోవోల్టేజీ రావడంతో మోటర్లు కాలిపోవడమే కాదు ఫీజులు కొట్టివేస్తున్నాయి. దీంతో రాత్రి 11 గంటలనుంచి ఇచ్చే త్రీఫేజ్ కరెంటును వినియోగించుకునేందుకు రాత్రి పూట పొలల వద్ద పడుకుంటున్నారు. రాత్రి 11 నుంచి తెల్లవారు జామున 4గంటల వరకు ఊరిన నీటిని ఊరినట్లుగా.. పొలాలకు ప్రత్యేకంగా పైపులతో పారిస్తున్నారు. ఇంత చేస్తున్నా సదరు పంట చేతికి వచ్చే పరిస్థితి మాత్రం కనిపించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒక్కసారైనా ఇరుకుల్ల వాగులోకి నీళ్లు విడుదల చేయాలని కోరుతున్నారు. పదేళ్ల క్రితం పరిస్థితి మళ్లీ వచ్చిందంటూ ఆవేదన చెందుతున్నారు.



నీళ్లులేక ఎండిపోయిన వరి పంటను తగులబెడుతున్న ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ రైతులు(ఫైల్)

### అంతటా ఇదే దుస్థితి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాగునీటి తిప్పలు మొదలయ్యాయి. పోయిన యాసంగిలో పచ్చగా కనిపించిన వ్యవసాయ భూములు, ఇప్పుడు నెర్రెలు వారి కనిపిస్తున్నాయి. పంటలు చేతికొచ్చే దశలో వేలాది ఎకరాల్లో ఎండుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 మండలాల్లో కరువు చాయలు కనిపిస్తున్నాయి. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు కాళేశ్వరం జలాలను ఎత్తిపోయడంతో మండుటెండల్లోనూ చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంల మత్తళ్లు దుంకినా.. ఇప్పుడు ఎక్కడికక్కడ భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. శ్రీరాజరాజేశ్వర రిజర్వాయర్ (మధ్యమానేరు)లో అంతంత మాత్రమే నీరు ఉండడం, అన్నపూర్ణ రిజర్వాయర్ అడుగంటిపోవడంతో సాగు నీటి కష్టాలు ఎక్కువయ్యాయి. ఈ పరిస్థితుల్లో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. దీంతో కొందరు పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తుండగా, మరికొందరు ఇక నీరు రాదని, పంట దక్కదనే ఆవేదనతో నిప్పు పెడుతున్నారు. ఇలానే ఈనెల 11న ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ రైతులు వరికి అగ్గి పెట్టారు. దాదాపు అంతటా సాగునీరు లేక.. కరెంట్ సరిగ్గా రాక పంటలను వదిలేసే పరిస్థితే కనిపిస్తుండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై రైతులు మండిపడుతున్నారు. కేసీఆర్ పాలనలో ఏనాడూ సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు పడలేదని, సంతోషంగా సాగు చేసుకున్నామని గుర్తు చేస్తున్నారు. కానీ, కొత్త ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే ప్రాజెక్టును ఏడారిగా చేశారని, భూగర్భ జలాలు అడుగంటి పోయి పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన చెందారు.

## వందరోజుల్లోనే విఫలం

- **కాంగ్రెస్ సర్కారుపై సన్నగిల్లుతున్న విశ్వాసం**
- **కేసీఆర్ పాలనలోనే సబ్బండ వర్గాలకు న్యాయం**
- **పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్**



నర్సింహులపల్లిలో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్

ధర్మారం, మార్చి 20: వంద రోజుల్లోనే కాంగ్రెస్ సర్కారు అన్నింటా విఫలమైందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. వచ్చే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ పదేండ్ల పాలనకు, రేవంత్ పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. పుష్కలంగా సాగునీరందించి ఒక్క మడి కూడా ఎండకుండా నీరందించిన ఘనత బీఆర్ఎస్ సర్కార్‌దేనన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కాల్వలకు నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. బుధవారం ధర్మారం మండలం నర్సింహులపల్లిలో రేణుకా ఎల్లమ్మ పట్నాలకు కొప్పుల హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాయకులతో మాట్లాడారు. వాగులు, ఒర్రెలు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతులు అల్లాడిపోతున్నారన్నారు. కాంగ్రెస్ పాలనపై వ్యతిరేకత మొదలైందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ప్రభావం కనిపిస్తుందని చెప్పారు. బీఆర్ఎస్‌కు ఉజ్వల భవిష్యత్ ఉన్నదని, వచ్చే లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు ఓపికతో ఉండాలని ఉద్బోధించారు. కష్టపడి పనిచేసి ప్రజల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి పార్టీ విజయానికి కృషి చేయాలని సూచించారు. అంకితభావంతో పనిచేసిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో మంచి అవకాశాలు వస్తాయని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుపై ఓటేసి తనను గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్యాక్స్ చైర్మన్ ముత్యాల బలరాంరెడ్డి, దొంగతుర్తి ఎంపీటీసీ దాడి సదయ్య, మాజీ సర్పంచ్ అడువాల అరుణజ్యోతి, నేతలు గాండ్ల నర్సయ్య,ఆవుల శ్రీనివాస్, ఆవుల వేణు, రమణ, ఎల్లయ్య, శ్రీనివాస్, గుర్రం తిరుపతి, బొంగాని తిరుపతి, వెంకటస్వామి ఉన్నారు.

## లూసియానా టెక్ యూనివర్సిటీతో 'జ్యోతిష్మతి' ఒప్పందం

- **అంతర్జాతీయ ఎక్స్‌పోజర్‌ను విద్యార్థులకు అందించడమే లక్ష్యం**
- **చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు**

కమాన్ చౌరస్తా, మార్చి 20 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో స్వయం ప్రతిపత్తి సాధించిన మొదటి విద్యాసంస్థగా గుర్తింపు పొందిన జ్యోతిష్మతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (జేఐటీఎస్) తాజాగా మరో అడుగు ముందుకేసింది. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో మరింత నైపుణ్యం పెంచి, వారిని పోటీ ప్రపంచానికి అనుగుణంగా అంతర్జాతీయ స్థాయిలో తీర్చిద్దిద్దేందుకు ఏకంగా అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీతో అకాడమిక్ పార్టనర్ షిప్‌నకు జ్యోతిష్మతి యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకున్నది. దీనిపై జ్యోతిష్మతి కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో విద్యార్థులకు కలిగే ప్రయోజనాల గురించి బుధవారం 'నమస్తే తెలంగాణకు' వివరించారు. జ్యోతిష్మతి కళాశాలను 1997లో ప్రారంభించి ఒక మార్గదర్శక విద్యాసంస్థగా తీర్చిదిద్దామని, స్వయం ప్రతిపత్తి సాధించిన మొదటి కళాశాలగా ఉమ్మడి జిల్లాలో నిలబెట్టామని చెప్పారు. నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్, న్యాక్ గ్రేడ్‌తో గుర్తింపు పొంది ఇంజినీరింగ్‌లో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, వేలాది మందికి వివిధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు వచ్చేలా చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా సాంకేతిక రంగం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్నదని, ఇంజినీరింగ్ రంగంలో అనేక మార్పులు వస్తున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రపంచ స్థాయిలో రాణించేందుకు అవసరమైన శిక్షణ, నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీ అధ్యక్షుడు జేమ్స్ హెండర్స్‌తో ఒప్పందం చేసుకున్నామని వెల్లడించారు. దీనివల్ల తమ విద్యార్థులు లూసియానా విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేట్, మాస్టర్ డిగ్రీలో సులువుగా ప్రవేశం పొందే అవకాశం ఏర్పడిందని, అలాగే గ్రాడ్యుయేట్ అసిస్టెంట్‌షిప్‌ల రూపంలో స్కాలర్‌షిప్ పొందే సౌకర్యం కలిగిందన్నారు. ఫ్యాకల్టీ ఎక్స్చేంజ్‌తో అధ్యాపకుల పరిణితి పెరిగి విద్యార్థులకు మేలు జరుగుతుందని, ఇరువురం కలిసి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తామని, తద్వారా తమ విద్యాసంస్థలో చదివే విద్యార్థులకు అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ వస్తుందని చెప్పారు. దీని ద్వారా లూసియానా వంటి ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయంలో ఎంఎస్ ప్రోగ్రామ్‌లో అడ్మిషన్లు పొందేందుకు మార్గం సులువు అవుతుందన్నారు. ఈ యూనివర్సిటీ ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్ కోర్సులకు ప్రసిద్ధి చెందిందని తెలిపారు. విద్యార్థుల పరిణితిని అంతర్జాతీయస్థాయికి తగ్గట్టు పెంచేందుకు తమ ఒప్పందం దోహద పడుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ సాగర్‌రావు






## నమో నారసింహ



ఊరేగింపులో వెళ్తున్న స్వామివారి ఉత్సవ మూర్తులు

ధర్మపురి, మార్చి20: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. వేడుకల్లో మొదటి ఘట్టమైన పుట్ట బంగారం పూజా కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. కాగా, స్వామివారి వారల ఉత్సవ మూర్తులను మేళతాళాలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య చింతామణి చెరువు సమీపంలోని పుట్టబంగారం మండపానికి తీసుకెళ్లారు. ప్రత్యేక పూజలు చేశారు. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పుట్టబంగారాన్ని తవ్వగా, భక్తులు సేకరించారు. కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డా.శ్రీకాంత్ రెడ్డి, ఈఓ శ్రీనివాస్ ఉన్నారు.

## కాంగ్రెస్ పాలనలో కటిక చీకటే

- **కేసీఆర్ హయాంలో సబ్బండ వర్గాలకు న్యాయం**
- **బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్**



ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్లకు నమస్కరిస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

మల్లాపూర్, మార్చి 20: 'కాంగ్రెస్ వంద రోజుల పాలనలో రైతులకు మిగిలింది కటిక చీకటే. భవిష్యత్‌లోనూ ఒరిగేదేమీ ఉండదు' అని నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ నిప్పులు చెరిగారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలోనే సబ్బండ వర్గాలకు మేలు జరిగిందని, ఏ గ్రామానికి వెళ్లినా అప్పుడు చేసిన అభివృద్ధే కనిపిస్తున్నదని చెప్పారు. రేవంత్ సర్కారు వృద్ధులకు కూడా సకాలంలో పింఛన్లు అందించలేని దుస్థితిలో ఉన్నదని విమర్శించారు. బుధవారం రాఘవపేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజామాబాద్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు, ఎమ్మెల్యే సంజయ్, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ మచ్చలేని, అపార రాజకీయ అనుభవమున్న బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామీణ నేపథ్యమున్న ఆయనకు ప్రజల కష్టసుఖాలు అన్నీ తెలుసని, వారి సంక్షేమానికి కృషి చేస్తారని చెప్పారు. ఇక్కడ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి పాల్గొన్నారు.